క్లుప్తంగా

నమస్తే పథకంలో నమోదు చేసుకోవాలి

అమలాపురం టౌన్: పారిశుద్ధ్య కార్మికులు, సెప్టిక్ ట్యాంక్ డ్రైవర్లు, హెల్పర్ల జీవన భద్రత, మెరుగైన ఉపాధి కల్పన, సామాజిక న్యాయం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టమ్(నమేస్తే) పథకంలో సఫాయి కార్మికులంతా నమోదు కావాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ సూచించారు. ఈ పథకాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. పథకంలో భాగంగా అమలాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పథకంలో పేర్లు నమోదు చేయించుకోవడం వల్ల కార్మికులకు ఆయుష్మాన్ భారత్ ద్వారా ఉచిత వైద్యం, మెరుగైన జీవనోపాధికి రుణాలు, వారి పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందుతాయన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



కృష్ణకుమారి కుటుంబీకులకు నగదు అందజేస్తున్న సర్పంచ్ సూరిబాబు తదితరులు

తాళ్లరేవు: మండలంలోని జి.వేమవరం పంచాయతీకి చెందిన పుణ్యమంతుల కృష్ణకుమారి(43) మృతి చెందారు. వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేల నగదును కృష్ణకుమారి తల్లి నాగరత్నానికి సర్పంచ్ పి.సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు యర్రంనీడి అప్పారావులు బుధవారం అందజేశారు. మిగిలిన మొత్తాన్ని బ్యాంక్‌లో జమ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గండి రామాంజనేయులు, పుణ్యమంతుల శ్రీను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవులోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల నిమిత్తం ఈ నెల 9వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ జి.ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా మండలంలోని తాళ్లరేవు, పి.మల్లవరం, జార్జిపేట, గాడిమొగ, భైరవపాలెం, పోలేకుర్రు పంచాయతీల పరిధిలోని గ్రామాలకు, కోరంగి పంచాయతీ పరిధిలోని సీతారామపురం, కోరంగి, పెద్దబొడ్డు, చిన్నబొడ్డు వెంకటాయపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందన్నారు.

నూతన తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రశాంతి

కాట్రేనికోన: కాట్రేనికోన నూతన తహసీల్దార్‌గా నియమితులైన దాసరి ప్రశాంతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ కృష్ణా జిల్లా ఆర్డీఓ కార్యాలయంలో తహసీల్దార్‌గా పనిచేసిన ప్రశాంతి ఎన్నికల బదిలీల్లో భాగంగా కాట్రేనికోనకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానన్నారు. రాబోయే ఎన్నికలు పారదర్శకంగా జరిపించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లరేవు: మండలంలోని చొల్లంగిపేటలో ఉన్న డా.బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 80 సీట్లు, ఇంటర్మీడియేట్‌లో సీఈసీ 40, హెచ్ఈసీ 40 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆంగ్ల మాధ్యమంతో కూడిన విద్యా బోధన, అత్యున్నతమైన ఉపాధ్యాయ బృందం, అధునాతన సౌకర్యాలతో కూడిన వసతి కల్పించనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష లోపు ఉండాలని, తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్నవారు మాత్రమే అర్హులని తెలిపారు. ఈ నెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సీఎంను కలిసిన డైలీ రేటెడ్ ఉద్యోగులు

యానాం: నియోజకవర్గ పరిధిలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న డైలీ రేటెడ్ ఉద్యోగులు సీఎం రంగసామిని బుధవారం కలిశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న హౌస్ కీపింగ్, వాచ్‌మెన్ పోస్టులను పర్మినెంట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన సీఎం రంగసామి త్వరలోనే ఆ పోస్టులను పర్మినెంట్ చేసేలా సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీపీ అండ్ఏఆర్ కార్యదర్శి కేశవన్, పుదుచ్చేరి ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు సెల్వం, రాజేంద్రన్, మురుగవేలు, ఆనందరాజన్, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

సంతాన ప్రదాత కాలభైరవుడు

రేపు చొల్లంగి తీర్థం



కాలభైరవ స్వామి

కాట్రేనికోన: పల్లం పంచాయతీ బ్రహ్మసమేధ్యం(బ్రహ్మసూత్రం)లో సుమారు 200 ఏళ్లకు పూర్వం స్వయం సిద్ధంగా కాలభైరవుడు, బ్రహ్మేశ్వరుడు, కనదుర్గమ్మలు వెలిశారని ప్రతీతి. ఇక్కడ వెలసిన కాలభైరవస్వామి సంతానం కలగని దంపతులకు పండంటి బిడ్డను ప్రసాదించే సంతాన ప్రదాతగా పేరొందాడు. అమావాస్య రోజు సముద్ర స్నానం ఆచరించి స్వామిని దర్శించుకుంటే సకల పాపాల నుంచి విమోచనం కలుగుతుందని భక్తుల నమ్మకం. ఈ నెల 9వ తేదీ శుక్రవారం చొల్లంగి తీర్థం జరగనున్న నేపథ్యంలో ‘సాక్షి’ అందిస్తున్న ప్రత్యేక కథనమిది..

స్వయం భువుడు కాల భైరవుడు

బ్రహ్మసమేధ్యంలో భక్తులు కోరిన కోర్కెలను తీరుస్తూ సంతానమూర్తిగా వెలసిన కాలభైరవుడు స్వయం భువుడు. సుమారు 200 ఏళ్ల క్రితం స్థానిక మత్స్యకారులు చేపల వేట చేస్తున్న సమయంలో కాలభైరవుడు, పార్వతీ సమేత బ్రహ్మేశ్వరుడి(బ్రహ్మసూత్రం) ప్రతిమలు వలలో చిక్కుకున్నాయి. వారికి ఆలయాలు నిర్మించి స్వామివారి విగ్రహాలను ప్రతిష్ఠించి ఏటా చొల్లంగి అమావాస్య రోజున ఉత్సవాలు చేస్తున్నారు. పల్లం, నీళ్లరేవు, చిర్రయానం, కొత్తపాలెం, మొల్లేటిమొగ తదితర గ్రామాల ప్రజలు ఆలయానికి చేరుకుని స్వామికి ఇష్టమైన క్షీరాన్నంను నైవేద్యంగా పెడతారు. తుపాను ప్రభావంతో తాడి చెట్టు ఎత్తున్న సముద్రం ఎగసిపడి వస్తున్నపుడు స్వామి సముద్రానికి ఎదురుగా శిలపై కూర్చుని దంత ధావనం చేసుకున్నాడని, సముద్రం వెనుదిరిగి వెళ్లిపోయిందని పెద్దలు చెబుతారు. దీనికి గుర్తుగా ఆలయం ఎదుట స్వామివారి పాద ముద్రలున్న శిల భూమిలో దిగి ఉంటుంది.

పండంటి బిడ్డను ప్రసాదించే సంతాన ప్రదాత

పిల్లలు లేని దంపతులకు పండంటి బిడ్డను ప్రసాదించే సంతాన మూర్తిగా కాలభైరవుడు ప్రసిద్ధి చెందాడు. సంతానం లేని మహిళలు చొల్లంగి అమావాస్య రోజున రాత్రి వేళ సముద్ర స్నానం ఆచరించి తడి వస్త్రాలతో స్వామి వారి పాదముద్రలపై పడతారు. అనంతరం అక్కడే నిద్రలోకి జారుకుంటారు. మహిళలకు నిద్రలో స్వామి దర్శనం ఇస్తారని ఆలయ అర్చకులు తెలిపారు. సంతానం కలిగిన భక్తులు బిడ్డలతో పాటు స్వామిని దర్శించుకుని అరటి గెలను, కొబ్బరి మొక్కను మొక్కుగా చెల్లించుకుంటారు. ఏటా సంతానం కోసం వందలాది మంది మహిళలు వచ్చి స్వామి పాదాలపై పడతారు. కాలభైరవుడి సోదరుడిగా బ్రహ్మేశ్వరస్వామి బ్రహ్మ సమేధ్యంలో పార్వతీ సమేతంగా భక్తులకు దర్శనమిస్తాడు. బ్రహ్మేశ్వరస్వామి భక్తుల కోరిన కోర్కెలు తీరుస్తారని ప్రతీతి.



బ్రహ్మసమేధ్యంలో చొల్లంగి తీర్థానికి ముస్తాబైన కాలభైరవ స్వామి ఆలయం



సంతానం కోసం కాలభైరవస్వామిని మొక్కుతున్న మహిళలు

తీర్థానికి ఏర్పాట్లు పూర్తి చేశాం



చొల్లంగి తీర్థానికి విచ్చేస్తున్న భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశాం. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ సారథ్యంలో పల్లం గ్రామ ప్రజల ఆర్థిక సహాయంతో కాలభైరవ స్వామి ఆలయాన్ని నూతనంగా నిర్మించాం. ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం ఈ నెల 28న అత్యంత వైభవంగా జరుగుతుంది. చొల్లంగి తీర్థం మహోత్సవాలు పురాతనమైన కాలభైరవస్వామి ఆలయంలోనే యథావిధిగా జరుగుతాయి.

– మల్లాడి వీర బాబ్జి, సర్పంచ్, పల్లం

విద్యార్థినులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కోటిలింగం, అధ్యాపకులు

అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో అత్యుత్తమ మార్కులు సాధిస్తున్న విద్యార్థినులకు మలబార్ గోల్డ్ సంస్థ మెరిట్ ఆధారంగా ప్రతిభా పురస్కారాలు, స్కాలర్‌షిప్‌లు అందజేసింది. ఉమ్మడి జిల్లాలో మొత్తంగా 88 మంది విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున స్కాలర్‌షిప్‌లు ఇచ్చారు. కాకినాడ జగన్నాథపురం వద్ద గల అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన పురస్కారాల ప్రదానోత్సవ సభలో అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు మంగా సత్య రత్నకళ, పడగ కృష్ణ సత్యశ్రీ బిందు, దామిశెట్టి సిరి లలిత, కల్లేపల్లి పూజిత, సరెళ్ల సుదీప్తి లక్ష్మి పురస్కారాలతో పాటు రూ.10 వేల స్కాలర్‌షిప్ అందుకున్నారు. కళాశాలలో బుధవారం జరిగిన అభినందన సభలో పురస్కారాలకు ఎంపికైన ఐదుగురు విద్యార్థినులను ప్రిన్సిపాల్ కోటిలింగం, సీనియర్ అధ్యాపకులు జె.శాంతాకుమారి, పి.కర్ణారావు, కో ఆర్డినేటర్ వై.సుబ్బారావు, ఎ.శ్రీనివాస్ తదితర అధ్యాపకులు అభినందించారు.

నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ



చెయ్యేరులో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా రవాణా శాఖాధికారి డి.అశోక్ ప్రతాప్‌రావు



రోడ్డు ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రవికుమార్

కాట్రేనికోన: నిబంధనలు పాటించడం ద్వారానే రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఆస్కారమేర్పడుతుందని జిల్లా రవాణా శాఖాధికారి డి.అశోక్ ప్రతాప్‌రావు అన్నారు. బుధవారం చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కాలేజీలో ప్రిన్సిపాల్ బి.రత్నంరాజు అధ్యక్షతన రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రహదారి భద్రతపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖాధికారి డి.అశోక్ ప్రతాప్‌రావు రహదారి భద్రత విషయంలో యువత పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ డీవీఎస్ఎస్ వర్మ, పాలకవర్గ సభ్యులు సందీప్, ట్రాన్స్‌పోర్ట్ విభాగాధిపతి ఎ.వెంకటరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా వారోత్సవాలు

అమలాపురం టౌన్: రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సీహెచ్ సుబ్బారెడ్డి అధ్యక్షతన విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన అమలాపురం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) రవికుమార్ మాట్లాడుతూ కొందరు విద్యార్థులు మితిమీరిన వేగంతో మోటారు సైకిళ్లు నడుపుతున్నారన్నారు. దీనివల్ల రోడ్డు ప్రమాదాల్లో విలువైన జీవితాన్ని కోల్పోయే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో రోడ్డు సేఫ్టీ ఎన్జీవో డైరెక్టర్ వాసు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రాథమికంగా అనుసరించాల్సిన నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

జగనన్న సురక్షతో అందరికీ ఆరోగ్య భరోసా



శిబిరంలో చికిత్స సమాచార ఫైల్‌ను అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి తదితరులు

అమలాపురం టౌన్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలతో అందరికీ ఆరోగ్య భరోసా ఏర్పడుతోందని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. స్థానిక మహిపాలవీధి వార్డు సచివాలయంలో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 కార్యక్రమాన్ని చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి ప్రారంభించి ప్రసంగించారు. డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఎం.దుర్గారావు దొర, మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ పాల్గొని వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొల్లాటి దుర్గాబాయి, మున్సిపల్ మేనేజర్ ఎంవీఎస్ఎన్ మూర్తి, వైఎస్సార్ సీపీ నాయకుడు రెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, కమిషనర్ మనోహర్‌లు పట్టణంలోని వాటర్ వర్క్స్ విభాగం, పార్కు, కంపోస్ట్ యార్డును సందర్శించారు. మున్సిపల్ పంపు హౌస్, మంచి నీటి చెరువు, అక్కడే ఉన్న పార్కును పరిశీలించి ఆయా విభాగాల సిబ్బంది పలు సూచనలు ఇచ్చారు. తాగునీటి సరఫరా, పార్కుల నిర్వహణ, కంపోస్టు యార్డుకు తరలించే చెత్త విషయంలో సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ డీఈఈ నాగ సతీష్, ఏఈ వెంకటేష్, ఇంజినీరింగ్ విభాగం సిబ్బందిఎ పాల్గొన్నారు.

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన



ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్లు, బీఎల్వోలు

అమలాపురం టౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బుధవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని సూర్యనగర్ కమ్యూనిటీ హాలు, రవణం మల్లయ్య వీధి, విద్యుత్ నగర్ ప్రాంతాల్లో ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన కల్పించారు. ఈవీఎం ద్వారా ఓటు ఎలా వేయాలి, ఓటు వేసేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, అనుసరించాల్సిన విధి విధానాలను వివరించారు. కొంత మంది ఓటర్ల చేత ప్రయోగాత్మకంగా ఈవీఎంలతో ఓటు వేయించి అవగాహన కల్పించారు. ఈ డెమోలకు సూపర్‌వైజర్లుగా మున్సిపల్ మేనేజర్ మాచిరాజు మూర్తి, ఏఈ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ బదరీనాథ్ వ్యవహరించారు. బూత్ లెవెల్ ఆఫీసర్(బీఎల్వో), వార్డు సచివాలయ కార్యదర్శి కొత్తలంక దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నల్లముట్టు పురుగు నివారణకు చర్యలు చేపట్టాలి



సన్నవిల్లిలో బదనికలను కొబ్బరి చెట్టుపై వదిలిపెడుతున్న శాస్త్రవేత్తలు

ఉప్పలగుప్తం: కొబ్బరి రైతులు అంబాజీపేట వైఎస్సార్ హార్టికల్చర్ పరిశోధనా కేంద్రం సహాయంతో రాయితీపై అందించే బదనికలను వినియోగించుకుని సామూహికంగా నల్లముట్టు పురుగు నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి బీవీ రమణ సూచించారు. మండలంలోని సన్నవిల్లిలో ఇటీవల నల్లముట్టు పురుగు సంతతి పెరిగి కొబ్బరి చెట్లకు నష్టం చేకూర్చటంతో బుధవారం ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు ఆ ప్రాంతాన్ని పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఐసీఆర్పీ బయో కంట్రోల్ నోడల్ అధికారి పి.శివకుమార్ నల్లముట్టు పురుగు నివారణకు రైతులు గొనియోజస్, నెఫాంటీడీస్ బదనికలను ఉపయోగించుకోవాలని వివరించారు. అవి ఎలా పనిచేస్తాయో రైతులకు ప్రయోగాత్మకంగా చూపించి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చిక్కం జంగమయ్య, ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజాకుమారి, సీనియర్ పరిశోధకులు ఎస్‌బీవీ చలపతిరావు, బి.నీరజ, వి.అనూష, మండల ఇన్‌చార్జ్ ఉద్యానశాఖ అధికారి ఎం.శైలజ, రైతులు చిక్కం వీరా స్వామినాయుడు, నాగబాబు, గనిశెట్టి సత్యనారాయణ, వీఏఏ శ్రీసత్య, వీహెచ్ఏలు శివాజి, సుధాకుమారి పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న సర్పంచ్ కామాడి గోవలక్ష్మి తదితరులు

తాళ్లరేవు: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గాడిమొగ సర్పంచ్ కామాడి గోవలక్ష్మి అభినందించారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఖోఖో, కబడ్డీ పోటీల్లో పాల్గొని నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన పంచాయతీకి చెందిన మెన్, ఉమెన్ క్రీడాకారులను సర్పంచ్ గోవలక్ష్మి, ఉపసర్పంచ్ కె.లోకేష్, పంచాయతీ కార్యదర్శి విజేవీ రమణ తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో కామాడి మాతరాజు, వెంకటేష్, వీరబాబు, పంచాయతీ సిబ్బంది సాగర్, శివ శంకర్, త్రిపుర, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలి



గోపవరంలో ఎలుకల నివారణ చర్యలు చేపడుతున్న ఏఓ కుమార్‌బాబు, రైతులు

అల్లవరం: రైతులందరూ సామూహికంగా ఎలుకల నివారణ చేపడితే వరిలో అధిక దిగుబడులు సాధ్యమని వ్యవసాయాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ అన్నారు. అల్లవరం రైతు భరోసా కేంద్రంలో బుధవారం సామూహికంగా ఎలుకలను నివారించేందుకు ఉచితంగా బ్రోమోడయోలిన్ మందును రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఒక ఎకరం వరి క్షేత్రంలో ఎలుకల నివారణకు 4 గ్రాముల మందు, 4 గ్రాముల నూనె, 192 గ్రాముల బియ్యం నూకలను కలిపి పొట్లాలుగా కట్టి ఎలుకల బొరియల్లో ఉంచడం ద్వారా ఎలుకల నివారించొచ్చని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ, సొసైటీ అధ్యక్షులు యల్లమిల్లి బోసు, యల్లమిల్లి వెంకటరమణ, నిచ్చెనకోళ్ల సుదర్శనరావు, బొక్కా శ్రీను, దాసం శ్రీరామచంద్రమూర్తి, నడింపల్లి సూర్యనారాయణరాజు, రమణాతి రమణ పాల్గొన్నారు.

ముమ్మిడివరం: మండలంలోని రైతు భరోసా కేంద్రాల వద్ద సామూహిక ఎలుకల నిర్మూలనపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు ఎంవీ రామారావు మాట్లాడుతూ ప్రస్తుతం వరి చేలల్లో పిలకలు వచ్చే దశలో 4 శాతం, నుంచి 60 శాతం వరకు కోత దశలో 5 నుంచి 10 శాతం వరకూ ఎలుకలు నష్టం కలిగిస్తున్నాయన్నారు. ఎలుకల నివారణ కోసం 96 శాతం నూకలు, 2 శాతం నూనె, 2 శాతం బ్రోమోడయోలిన్ మందు కలిపి ఎరగా పెట్టాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంత కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: మండలంలోని మురమళ్లలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతుల పొలాల్లో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయశాఖ అధికారి ఎం.వాణి మాట్లాడుతూ ఎలుకల నివారణకు రైతులందరూ ఒకేసారి బ్రోమోడయోలిన్ మందును ఎలుకల బొరియల వద్ద పెట్టవలసి ఉంటుందన్నారు. దీని కోసం వ్యవసాయశాఖ ద్వారా రైతులకు బ్రోమోడయోలిన్ మందును రైతులకు ఇప్పటికే అందించామన్నారు. కార్యక్రమంలో విత్తనాల శ్రీరాములు, నడింపల్లి సూర్యనారాయణరాజు, సవరపు ప్రభుదాస్ పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: రబీ వరి సాగులో ఎలుకలను నివారించి పంట దిగుబడిని కాపాడుకోవాలని వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు సూచించారు. మండలంలోని గోపవరం గ్రామంలో బుధవారం ప్రభుత్వ 100 శాతం సబ్సిడీపై అందిస్తున్న బ్రోమోడయోలిన్ మందును నూకలలో కలిపి రైతులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, వీఏఏ ఎల్.అనూష, సింగంశెట్టి సతీష్, పెమ్మిరెడ్డి సత్యనారాయణ, అయినవిల్లి వీరరాఘవులు, అయితాబత్తుల రామరాజు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు ఎలుకల మందు పంపిణీ చేస్తున్న ఏఓ ఎస్‌వీవీ సత్యనారాయణ తదితరులు



కర్రివానిరేవులో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు



మురమళ్లలో ఎలుకలను నివారించే పద్ధతిని వివరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

త్యాగానికి ప్రతిరూపం రమాభాయి



అంబేడ్కర్, రమాభాయి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ముమ్మిడివరం: త్యాగానికి ప్రతిరూపం మాతా రమాభాయి జీవితం అని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎం ఋషి పేర్కొన్నారు. ముమ్మిడివరం డా.బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం ఆర్‌పీఐ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సతీమణి రమాభాయి 127వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రమాభాయి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చీకురుమిల్లి శ్రీనివాస్, దడాల రామకృష్ణ, బళ్ల సత్యనారాయణ, పుల్లెపు వెంకటేశ్వరరావు, జి.జ్ఞాన ప్రకాష్, మట్టా సిద్ధార్థ గౌతమ్, పి.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

యానాం శాంతియుత ప్రాంతం

యానాం: యానాం అందమైన పట్టణమే కాకుండా శాంతియుత ప్రాంతమని బదిలీపై వెళుతున్న ఎస్పీ రఘునాయగం పేర్కొన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 2022 నవంబరులో ఎస్పీగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి విధి నిర్వహణే ధ్యేయంగా పనిచేశానన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలతో పాటు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆర్ఏఓ మునిస్వామి, వివిధ శాఖల అధికారులు, పోలీసులు తనకు ఎంతగానో సహకరించారని వారికందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

రేపు అమలాపురంలో ప్రజా సైన్స్ కళా యాత్ర

అమలాపురం టౌన్: రాష్ట్రవ్యాప్తంగా శాస్త్రీయ దృక్పథ ప్రచారంలో భాగంగా జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ప్రజా సైన్స్ కళా యాత్ర నిర్వహిస్తోందని జిల్లా జేవీవీ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, ఎండీ ఖాజా మొహిద్దీన్ తెలిపారు. దీంట్లో భాగంగా ఈ నెల 9వ తేదీ సాయంత్రం 3 గంటల నుంచి అమలాపురం గడియారం స్తంభం సెంటరులో కళా జాతా నిర్వహిస్తున్నట్లు వివరించారు. సైన్స్ నృత్య రూపాలు, గీతాలు, నాటికలు, మేజిక్స్ ద్వారా కళా జాతాలో సైన్స్ ప్రచారం జరుగుతుందన్నారు. ప్రజానాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, ప్రజలు కళా జాతాలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ మృతి



పినిపే రాధాకృష్ణ(ఫైల్)

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన సీనియర్ న్యాయవాది, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి పినిపే రాధాకృష్ణ(61) బుధవారం ఉదయం మృతి చెందారు. ఐదు రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన ఆయన స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. గతంలో ఆయన అమలాపురం బార్ అసోసియేషన్ కార్యదర్శిగానూ పనిచేశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాధాకృష్ణ మృతిపై బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉండ్రు ఫణీంద్ర లక్ష్మణరావు, కార్యదర్శి డీవీఎస్ఎన్ మూర్తి, ఉపాధ్యక్షుడు కుడుపూడి త్రినాథ్, సీనియర్ న్యాయవాదులు డీబీ లోక్, ఎండీ ఆజామ్, నల్లా ప్రభాకర్, కటికదల సత్యనారాయణ, నల్లా రమేష్ తదితరులు సంతాపం తెలియజేశారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎంఏకే భీమారావు ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కార్యదర్శి చేగొండికి ఘన నివాళి

అమలాపురం రూరల్: బండారులంక పంచాయతీ కార్యదర్శి చేగొండి సత్యనారాయణమూర్తికి పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం అమలాపురంలో సత్యనారాయణమూర్తి కుటుంబ సభ్యులను కార్యదర్శులంతా పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జొన్నాడ వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ గుబ్బల మల్లికార్జునరావు, జిల్లా కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజులు సత్యనారాయణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తికి గాయాలు

కాట్రేనికోన: మండలంలోని కందికుప్ప పంచాయతీ చెందిన ఓలేటి నమఃశివాయ(46) బుధవారం విద్యుత్ షాక్‌తో తీవ్ర గాయాల పాలయ్యాడు. ఇంటికి ఎర్త్ కోసం భూమి లోపలికి ఉంచిన తీగ చుట్టూ చెత్తను శుభ్రం చేస్తున్న సమయంలో విద్యుత్ షాక్ తగిలింది. స్థానికంగా ఉన్న పీఎంపీ డాక్టర్‌తో వైద్యం చేయించారు. ప్రస్తుతం నమఃశివాయ పరిస్థితి బాగానే ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

తలనీలాలకు టెండర్ కం బహిరంగ వేలం

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలో ఈ నెల 16వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ జరిగే స్వామివారి కల్యాణోత్సవాల్లో భక్తులు స్వామికి సమర్పించుకునే తలనీలాలు పోగుచేసుకునే హక్కుకై బుధవారం ఆలయం వద్ద టెండర్ కం బహిరంగ వేలం ఆలయ అధికారులు నిర్వహించారు. సముద్రం వద్ద, దేవాలయం వద్ద తలనీలాలు పోగు చేసుకోవడానికి వేలం పాటలో హెచ్చు పాటదారుడైన తాడేపల్లిగూడేనికి చెందిన నీలగిరి మహేష్‌కు పాట ఖరారు చేసినట్టు అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. కాగా పర్యవేక్షణ అధికారిగా బి.సావరం గ్రూపు దేవాలయాల ఈవో టి.నాగ విష్ణు వ్యవహరించారు.